క్లుప్తంగా

శ్రీవారి ఆలయంలో అన్నదానం

సీతంపేట: సీతంపేటలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం దాతలు అన్నదానం చేశారు. భక్తులు తరలివచ్చారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

ఉద్యానవన మొక్కల పంపిణీ



రైతులకు ఉద్యానవన మొక్కలు పంపిణీ చేస్తున్న పీహెచ్‌ఓ

సీతంపేట: మండలంలోని పలువురు గిరిజన రైతులకు ఉద్యానవన మొక్కలను అధికారులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఓ గణేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి మొక్కలు పంపిణీ చేయనున్నామన్నారు. 2023 – 24 ప్లాంటేషన్‌లో భాగంగా జీడి, సపోట, కొబ్బరి, నిమ్మ, సీతాఫలం, వంటి మొక్కలు ఇస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యం, ఏపీఓ బాబురావు, సబ్ అసిస్టెంట్ కుండంగి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారికి ప్రభుత్వ సహకారం



పసుకువలసలో ఫిష్ ఆంధ్రా షాపును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: అన్ని వర్గాల వారిని ఆదుకునేందుకు జగనన్న ప్రభుత్వం సహకరిస్తుందని పసుకువలస సర్పంచ్ కోట మంజుభార్గవి అన్నారు. గ్రామ సమీపంలో జెజ్జి గ్రామానికి చెందిన మత్స్యకారుడు జనార్దనరావుకు మంజూరైన ఫిష్ ఆంధ్రా షాపును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణుల అభ్యున్నతికి సర్కారు చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలపై వివరించారు. అర్హులు వాటిని సద్వినియోగపర్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో బెజ్జి సర్పంచ్ శివ్వాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కోట అజయ్‌కుమార్, కె.జనార్దనరావు, పాసినపల్లి ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా మెనూ అమలు



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ ఆనందరావు

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా అమలవుతున్న జగనన్న గోరుముద్ద మెనూను పక్కాగా అమలు చేయాలని వీరఘట్టం ఎంఈఓ – 2 ఆర్.ఆనందరావు సూచించారు. కంబరవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శనివారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నాడు – నేడు ఫేజ్ 2లో భాగంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

రోడ్డు ప్రమాదాలు నివారణకు సహకరించాలి

సీతానగరం: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో, ద్విచక్ర, ఇతర వాహన చోదకులు సహకరించాలని ఎస్సై కె.నీలకంఠం కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం రాష్ట్ర రహదారిపై చినభోగిలి బస్టాప్, సీతానగరంలోని హనుమాన్ జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతికూడలి వద్ద తమ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. వాహనాలు నడిపే సమయంలో వేగాన్ని నియంత్రించి ఇతర వాహనాల రాకపోకలను గుర్తించి నడపాలని కోరారు. వాహనాలు నడిపే సమయంలో పోలీసువారు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను పరిశీలించి నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు. డ్రైవింగ్‌లో అనుభవం లేనివారికి, చిన్నపిల్లలకు వాహనాలను ఇవ్వరాదని అన్నారు. గతంలో వాహలనాపై విధించిన పాత బకాయిలను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కోరారు.

మత్స్యకార సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం

పార్వతీపురం టౌన్: సొసైటీ ఎన్నికల అధికారి ఆర్.శేషమ్మ ఆధ్వర్యంలో స్థానిక ఐఎఫ్‌సీఎస్ భవనంలో శనివారం నిర్వహించిన మత్స్యకార సొసైటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ ఎన్నికలో 9 మంది అభ్యర్థులు డైరెక్టర్‌లుగా నామినేషన్ వేయగా అందరూ ఏకగ్రీవమయ్యారు.ఎన్నికైన సొసైటీ నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా మురుముల్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బెహర అప్పారావు, డైరెక్టర్లుగా సింగిడి రాము, బి.శ్రీను, పొండ్రంకి కామరాజు, రాజాపు సింహాచలం, ఎస్.గణేష్, జి.లక్ష్మణరావు, బెహరా సీతారాలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు 129 మంది సంఘం సభ్యులు హాజరయ్యారు. గ్రామ మత్స్య సహాయకులు కోట శంకరరావు, మారోతు సరళ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి సమన్వయంతో పనిచేద్దాం..

- మండల సమావేశంలో ఎంపీపీ దీనమయ్య



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువ చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేద్దామని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వ శాఖల అధికారులు వారి వారి ప్రగతి నివేదికలు ప్రజాప్రతినిధులు తెలియజేశారు. పంచాయతీరాజ్ జేఈ కె.మురళీధర్ మాట్లాడుతూ నాడు – నేడు పథకం పనుల కోసం చెల్లించేందుకు నిధులు పుష్కలంగా ఉన్నాయని, పనులు చేపట్టిన తక్షణమే చెల్లించడం జరుగుతుందన్నారు. సంబంధిత పనులు సకాలంలో పూర్తయ్యేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. వైద్యాధికారులు మాట్లాడుతూ గర్భిణుల కోసం గుమ్మలక్ష్మీపురం వైటీసీలో వసతిగృహాన్ని నెలకొల్పడం జరిగిందని, రోడ్డు సదుపాయం లేని గ్రామాల గర్భిణులు ప్రసవ సమయానికి కనీసం నెల రోజుల ముందు వసతి గృహంలో చేరేలా ప్రోత్సాహం అందివ్వాలన్నారు. వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆర్బీకేల్లో ఎరువులు పుష్కలంగా ఉన్నాయని, ఎరువులు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించాలన్నారు. సబ్సిడీపై ఆయిల్ ఇంజిన్లు, మినీ ట్రాక్టర్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆశక్తి ఉన్న రైతులు తమను సంప్రదించాలన్నారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగు శాఖ ఏఈ ఎస్.అప్పారావు మాట్లాడుతూ రూ.2 కోట్లతో ఎస్‌కే పాడు నర్సరీలో యువతకు ఉపాధి కల్పించడంతో పాటు పర్యాటకంగా మండలానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టేలా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. నాడు – నేడు ఫేజ్ 2లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఎంఈఓ జనార్దన్ మాట్లాడుతూ మండలంలోని 172 పాఠశాలల్లో 9231 మంది విద్యార్థులు చదువుతుండగా వీరి కోసం 551 మంది ఉపాధ్యాయులున్నారని, మరో 19 పాఠశాలలకు అదనంగా ఉపాధ్యాయుల అవసరం ఉందని గుర్తించి, పక్క పాఠశాలల నుంచి సర్దుబాటు చేసినట్టు చెప్పారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల సమాచారం తమకు అధికారులు తెలియజేయడం లేదన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా పొటాష్ ఎరువును అందజేయాలని, దోమ తెరలు సరఫరా చేయాలని, ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్న గ్రామాల ప్రజలకు ముందుగా సమాచారం అందజేయాలని, దుమ్మంగి, బొద్దిడి, పి.ఆమిటి కాలనీలలో ప్రభుత్వ పాఠశాలలు నెలకొల్పాలని, పాఠశాలల్లో అర్ధాంతరంగా నిలిపివేసిన ప్రహరీ గోడల నిర్మాణ పనులు పూర్తి చేయాలంటూ పలువురు సభ్యులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో జరిగే అభివృద్ధి పనుల సమాచారం స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియపర్చాల్సిన బాధ్యత అధికారులకు ఉందని గ్రహించాలని, ప్రజా సంక్షేమం కోసం సమన్వయంతో పని చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, జెడ్పీటీసీ మండంగి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తదితరులున్నారు.

కూలిన పశువుల ఆస్పత్రి



నేల కూలిన పాలకొండ ఏరియా పశువుల ఆస్పత్రి

పాలకొండ రూరల్: నిత్యం పెద్ద సంఖ్యలో పాడి రైతులకు, మూగజీవాలకు సేవలందించే పాలకొండ పశువైద్య ఏరియా ఆస్పత్రి భారీ వర్షాల ధాటికి శనివారం వేకువజామున ఆకస్మాత్తుగా నేల కూలింది. దాదాపు 40ఏళ్ల పైబడి కోటదుర్గమ్మ దేవస్థానం సమీపంలో ఉన్న ఈ ఆస్పత్రి ఇప్పటికే అవసాన దశకు చేరుకుంది. ఈ క్రమంలో వరుస వర్షాలకు పడిపోయింది. స్థానికులు అందించిన వివరాల మేరకు ఉదయం 4 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విధులు నిర్వహించే సమయం కాకపోవటంతో పెద్ద ప్రమాదమే తప్పిపోయింది. మందులు, సిబ్బంది ఉండే గది పూర్తిగా పడిపోయింది. ఈ సమయంలో వైద్యాధికారి సిద్దార్థకు చెందిన ద్విచక్ర వాహనం భవనం క్రింద ఉండిపోవటంతో నుజ్జయ్యింది. భవనం కూలిపోవటంతో పశువులకు వైద్య సేవలు అందించే షెడ్‌లో తాత్కాలికంగా వైద్య సేవలు కొనసాగిస్తామని ఏడీ ప్రభా మాణిక రావు తెలిపారు. ఇక్కడ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

మూగజీవాల పెంపకంపై అవగాహన అవసరం



తుమరాడలో ఆవులకు లంపీ స్కిన్ టీకాలు వేస్తున్న వైద్యులు సిద్దార్థ

పాలకొండ రూరల్: పాడి రైతులు వారి పెంపకంలో ఉన్న మూగజీవాల ప్రవర్తన ద్వారా జీవాల ఆరోగ్య సమస్యలను గుర్తించి వైద్య సేవలు అందించాలని పశువైద్యాధికారి బి.సిద్దార్థ అన్నారు. పాలకొండ మండలం తుమరడ గ్రామంలో ప్రత్యేక పశు వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరంలో 45 ఆవులకు పరీక్షలు చేపట్టారు. లంపీ స్కిన్ టీకాలు వేశారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో పాడి రైతులు పెంపుడు జీవాల ఆరోగ్య రక్షణ పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పశువులకు అందించే దాణా మొదలుకుని వాటి నివాసాలకు ఏర్పాట్లు చేసిన షెడ్లు, పాకలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వివిధ రకాల వైరస్‌ల కారణంగా వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున వైద్యుల సలహాలను పాటించాలని సూచించారు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ



విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త ఉమాజ్యోతి

గుమ్మలక్ష్మీపురం: పనస పండుతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మంత్రజోల గ్రామానికి చెందిన గర్భిణులు, బాలింతలతో పాటు మహిళలకు రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్యా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం)కు చెందిన గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఉమాజ్యోతి శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పనస పండుతో హల్వ, జామ్ వంటి ఆహారం పదార్థాలను తయారు చేసి చూపించారు. తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సీజన్లో విరివిగా లభించే పనస పండుతో ఆహార ఉత్పత్తులను తయారు చేసుకోవడం వల్ల చిన్న పిల్లలకు అనుబంధ ఆహారం అందించే వారవుతామన్నారు. పనస పండుతో తయారు చేసిన విలువ ఆధారిత ఉత్పత్తుల్లో పొటాషియం మరియు పీచు పదార్థాలు అధికంగా ఉంటాయని, వాటిని ఆహారంగా స్వీకరించడం వలన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

వృద్ధులకు వరం 'కంటి వెలుగు'



విక్రంపురం సచివాలయం వద్ద నేత్ర పరీక్షలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కొమరాడ: అవ్వ తాతలకు డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ఓ వరమని డీఎంహెచ్‌ఓ బి.జగన్నాధరావు అన్నారు. మండలంలోని విక్రంపురం గ్రామ సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన నేత్ర పరీక్షల శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం శివిని గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. మలేరియా, డెంగీ ప్రబలే అవకాశం ఉన్నందున అంతా జాగ్రత్తలు పాటించాలన్నారు. కంటి వెలుగు జిల్లా నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వయసు గల వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆరుగురికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఐదుగురికి కేటరాక్ట్ శస్త్ర చికిత్స కోసం గుర్తించి రిఫర్ చేసినట్టు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్‌బాబు, వైద్యులు సాహితి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి: మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఐఓ టి.జగన్మోహనరావు సూచించారు. రావివలస పీహెచ్‌సీని శనివారం సందర్శించిన ఆయన సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులను గుర్తించి అవసరమైన పరీక్షలను నిర్వహించాలన్నారు. అసాధారణంగా ఉన్న ఫలితాల్లో ఉన్న గర్భిణులను హైరిస్క్‌గా గుర్తించి ప్రసవం పూర్తయిన కొన్ని రోజుల వరకు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉండాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పకడ్బందీగా గ్రామాల్లో నిర్వహించాలన్నారు. నవజాత శిశువుల గృహ సందర్శనలు చేసి ఆరోగ్య వివరాలు ఈ – ఆశా యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణకుమారి, సూపర్‌వైజర్లు ప్రకాష్, జైగొడ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదుకు సహకరించాలి

పాలకొండ రూరల్: రైతులు పంటల వివరాలను నమోదు చేసుకునేందుకు పూర్తి సహకారం అందించాలని వ్యవసాయాధికారిణి ఎన్ని వాహిని కోరారు. మండలంలోని లుంబూరు ఆర్బీకేను శనివారం ఆమె సందర్శించారు. రైతులకు అందించిన ఎరువుల వివరాలపై ఆరా తీసారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రస్తుత సీజన్‌లో వారు పండిస్తున్న పంటల వివరాలను నమోదు చేయించుకోవటం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ విధానం వలన పంటల బీమా, ధాన్యం కొనుగోలు, రైతు భరోసా వర్తింపుకు అవకాశం ఉంటుందన్నారు. పంటలు నమోదు చేసే క్రమంలో రైతులు వారి ఆధార్, 1–బీ అడంగల్, బ్యాంక్ అకౌంట్, పాస్ ఫొటో అందించాలని, కచ్చితంగా ప్రతి రైతు సహకరించాలన్నారు.

4వ వార్డులో సీతారాం గెలుపు

జియ్యమ్మవలస: మండలంలోని కొండచిలకాంలో 4వ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికలో మెల్లక సీతారాం విజయం సాధించారు. సీతారాంకు 64 ఓట్లు రాగా ప్రత్యర్థి రవికి 33 ఓట్లు పోలైనట్టు ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 131 ఓట్లకుగాను 97 ఓట్లు పోలైనట్టు తెలిపారు. సీతారాం 31 ఓట్లతో గెలుపొందినట్టు వెల్లడించారు.

వంట గ్యాస్ వినియోగంపై అవగాహన

గరుగుబిల్లి: వంట గ్యాస్ వినియోగదారులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వీలుగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి సురక్ష రబ్బర్ ట్యూబును విధిగా మార్చుకోవాలని పార్వతీపురం పెంటపాటి కామరాజు హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ డీలర్ పెంటపాటి సూర్యరావు, పెంటపాటి సాయికిరణ్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఉచిత గ్యాస్ స్టవ్ సర్వీసింగ్ శిబిరాన్ని గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, గరుగుబిల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి ప్రారంభించారు. సర్పంచ్ ఇందుమతి మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులు ఉచిత సర్వీసింగ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గ్యాస్ వినియోగదారులు పాల్గొన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

పార్వతీపురంటౌన్: వాహనచోదకులు తప్పకుండా నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై పాపారావు అన్నారు. ఈ మేరకు శనివారం నోయాక్సిడెంట్ డే సందర్భంగా ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు ఆయన కౌన్సెలింగ్ చేశారు. అంతరం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హితవు పలికారు. ఆటోడ్రైవర్లు అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండడంతో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే జరిమానాతో పాటు ఆటోను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కిశోర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పార్వతీపురంటౌన్: వార్డు వలంటీర్స్ నోటిఫికేషన్‌లో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామప్పలనాయుడు ఆధ్వర్యంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 13 పోస్టులకు గాను 77 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా ఇంటర్వ్యూకు 59 మంది హాజరయ్యారు. వారిలో ప్రతిభ కనబరిచిన 13 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు వినయ్, నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు సూచించారు. ఈ మేరకు గ్రూప్ 1, గ్రూప్ 2, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారికోసం ప్రత్యేకంగా మున్సిపాలిటీ నిధులతో చర్చివీధిలో గల పురపాలక గ్రంథాలయంలో కొత్త పోటీ పరీక్ష పుస్తకాలను శనివారం ఆయన ఆవిష్కరించారు. పార్వతీపురం పట్టణంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ సూచించారు. పురపాలక గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేకే పాడులో జమున మోడల్‌లో రాగి సాగు



జమున మోడల్‌లో రాగి పంట

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో భాగంగా మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ జేకే పాడు గ్రామంలో అలజంగి భాస్కరరావు అనే రైతు పొలంలో శనివారం జమున మోడల్‌లో రాగి పంటను నాటారు. ఈ సందర్భంగా ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కో ఆర్డినేటర్ భూషణరావు మాట్లాడుతూ ఈ విధానం ద్వారా బీజామృతం ఎరువుతో శుద్ధి చేసిన రాగి విత్తనాలను వరుస పద్ధతుల్లో నేరుగా పొలంలో నాటాల్సి ఉంటుందన్నారు. ఇలా చేయడం వలన పంట సమయం ఆదా కావటంతో పాటు సాధారణం కంటే అధిక దిగుబడులొస్తాయన్నారు. జమున మోడల్‌లో సాగు చేసిన రాగి పంట చుట్టూ అదనపు ఆదాయం కోసం తీగ జాతి కూరగాయాలు, కంది, వంగ, బెండలతో పాటు ఆకు కూరలు, బంతి వంటి పూలను కూడా సాగు చేసుకోవచ్చన్నారు. రైతులంతా ఈ విధానంలో రాగి పంటను సాగు చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. వైకేపీ సీసీలు ఎన్‌సీ గోపాల్, సుందరరావు, లక్ష్మణరావు, రైతు మిత్ర అధ్యక్షుడు అగ్గన్న, సీఆర్పీ దీప పాల్గొన్నారు.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి రమేష్‌బాబు

కొమరాడ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థల ద్వారా ఇచ్చిన రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొమరాడ పీఏసీఎస్ మరడాన సూరపునాయుడు అన్నారు. కొమరాడ పీఏసీఎస్ భవనం ఆవరణలో సహకార సభ్యుల మన్యం జిల్లా సహకార అధికారి ఎం.రమేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు సూరపునాయుడు మాట్లాడుతూ రైతులంతా కలసి గ్రూపులు ఏర్పాటు చేసుకొని పొదుపు చేసి రుణాలు పొందాలని సూచించారు. సభ్యులకు గిడ్డంగి, వేయింగ్ బ్రిడ్జి సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. శిక్షణ అధికారి రమేష్‌బాబు మాట్లాడుతూ సహకార సంఘ సూత్రాలు, విలువలు, సహకార సంఘ వ్యవస్థలపై అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. సహకార వ్యవస్థను రైతులే బలోపేతం చేయాలని సూచించారు. పీఏసీఎస్ సీఈఓ గుల్లి మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ఆరోగ్య రక్ష



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రవికుమార్

పాలకొండ రూరల్: వ్యాధులను అధిగమించే అవగాహనతోనే ఆరోగ్య రక్షణ లభిస్తుందని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రవికుమార్ అన్నారు. పీహెచ్‌సీ పరిధి డోలమడ గిరిజన గ్రామంలో శనివారం వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు బారిన పడిన రోగులను పరీక్ష చేసి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేస్తుందన్నారు. దీనిని గ్రామీణులు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే నాటు పద్ధతులు విడనాడి వైద్యులను ఆశ్రయించాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఆరోగ్య స్థితిగతులు పరిశీలించారు. ఇటీవల ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు పొంది ఇళ్లవద్ద ఉపశమనం పొందుతున్న వారి తాజా ఆరోగ్య స్థితిగతులను పరీక్ష చేసి అవసరమగు సలహాలు, సూచనలను అందించారు.

పశు వైద్య శిబిరం



పశు వైద్య శిబిరంలో మూగజీవానికి టీకా వేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము గ్రామంలో మాతోట, జీవా కార్యక్రమంలో భాగంగా పశువైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలోని అనారోగ్యం బారిన పడిన పశువులను గుర్తించి అవసరమైన వ్యాక్సిన్లను వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ ముఖ్యంగా ఈ సీజన్లో పశువులకు జబ్బవాపు, గొంతువాపు, ముద్ద చర్మ వ్యాధులు, గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి, మూతిపుండ్లు, ముసరా వ్యాధులు, కోళ్లకు కొక్కెర వ్యాధి, మశూచి, క్షయ, కండ్ల కలక వంటి వ్యాధులు వస్తాయన్నారు. పశువులకు ఈ వ్యాధులు వచ్చినట్లు గుర్తిస్తే తక్షణమే తమ సిబ్బందిని సంప్రదించి వైద్య సేవలు అందివ్వాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జీఓ కో ఆర్డినేటర్ జి.ప్రభోద్, జట్టు కో ఆర్డినేటర్ జి.మురళి, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కోరం లేకుండా మండల సమావేశమా..!



సమావేశంలో మాట్లాడుతున్న టింగ అన్నాజీరావు

భామిని: మండల సమావేశాన్ని నలుగురు సభ్యులతో కోరం లేకుండా ఎలా నిర్వహించారని వైఎస్సార్‌సీపీ నాయకులు, బత్తిలి ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహనబాబు అధికారులను ప్రశ్నించారు. మండల సమావేశంలో సభ్యులకు సరైన గౌరవం ఇవ్వని కారణంగానే మండల సమావేశాన్ని మెజార్టీ సభ్యులు బహిష్కరించామని వారు తెలిపారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమ్మేళనం పేరున శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల సమావేశానికి మెజార్టీ సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం కోసం సంతకాల కోసం దొంగ ప్రయత్నాలు చేశారని విమర్శించారు. సమావేశాన్ని ఎనిమిది మంది ఎంపీటీసీలు బహిష్కరించారన్నారు. వీరితో పాటు 22 మంది సర్పంచ్‌లు కూడా వ్యతిరేకించారని తెలిపారు. మండలానికి వచ్చిన నిధులను ఇష్టారాజ్యంగా కేటాయించడంపై మండిపడ్డారు. కనీసం ఎంపీటీసీలను సంప్రదించకపోవడమేమిటని నిలదీశారు. ఎంపీటీసీలు పత్తిక మురళి, బూస బాలకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్.గోపాలరావు, సర్పంచ్‌లు లోతుగెడ్డ రవికుమార్, కొత్తూరు ప్రసాద్, అన్ని పంచాయతీల నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు



వరి నాట్లు పూర్తయిన పొలాలు

పాలకొండ: పంట పొలాలకు రెండు రోజుల పాటు కురిసిన వర్షాలతో పుష్కలంగా సాగునీరు అందుతుంది. దీంతో రైతులు ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. వర్షంతో కాలువల్లో సాగునీరు పుష్కలంగా ప్రవహిస్తుండగా.. మరోవైపు నాగావళి ఎడమ కాలువల ద్వారా శివారు ప్రాంతాలకు నీరు విడుదల చేయడంతో శతశాతం దమ్ములు పూర్తి కావచ్చాయి. వరినాట్లు సకాలంలో పూర్తి చేయగా ప్రభుత్వం ఎరువులను సకాలంలో అందిస్తుండడంతో రైతులు సంబరపడుతున్నారు.